క్లుప్తంగా

షాదీముబారక్ చెక్కుల అందజేత



చెక్కు అందిస్తున్న సర్పంచ్

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గూడూర్ గ్రామానికి చెందిన పలువురికి మంజూరైన షాదీముబారక్ చెక్కులు సర్పంచ్ స్వరాజ్యలక్ష్మి మంగళవారం అందజేశారు. పేద కుటుంబాలకు కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన షాదీముబారక్, కళ్యాణలక్ష్మి పథకం ఎంతగానో ఉపయోగ పడిందని సర్పంచ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మురళి, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

మొక్కలు సిద్ధం చేయాలి



నర్సరీ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

చిలప్‌చెడ్(నర్సాపూర్): వర్షాకాలం సీజన్ వచ్చే సరికి హరితహారం లక్ష్యం నెరవేరేలా ప్రతీ గ్రామ నర్సరీలో మొక్కలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ శశిప్రభ అన్నారు. మంగళవారం ఆమె మండల పరిధిలోని అజ్జమర్రి, జగ్గంపేట, గంగారం, ఫైజాబాద్ గ్రామాల్లోని నర్సరీల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా శశిప్రభ మాట్లాడుతూ.. నర్సరీల్లో ప్రస్తుతం పాలిథిన్ కవర్లలో మట్టి నింపే పనులు జరుగుతున్నాయన్నారు. నర్సరీ పనులు వేగవంతం చేయాలని, వానకాలం సీజన్ ప్రారంభానికి ముందే మొక్కలు తయారయ్యేలా తగిన చర్యలు చేపట్టాలని టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించామన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీ భగవాన్, కార్యదర్శులు ప్రశాంతి, నాగరాజు, ఆశోక్, పీల్డ్ అసిస్టెంట్‌లు రవీందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు పశుగ్రాసం అందజేత



పశుగ్రాసం అందిస్తున్న దాత

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని దొంతి వేణుగోపాలస్వామి ఆలయం వద్ద నున్న గోశాలకు దాత మంగళవారం ఎండు పశుగ్రాసం అందజేశాడు. మండల పరిధిలోని ఉసిరికపల్లి గ్రామానికి చెందిన వేణుగోపాల్ గుప్తా పశుగ్రాసం గోశాల నిర్వాహకులకు అందజేశాడు. దాతలు గోశాల అభివృద్ధికి వారికి తోచిన విధంగా సాయం చేయాలని నిర్వాహకుడు శ్రీనివాస్ కోరారు.

ప్రభాకర్‌రెడ్డి విజయం హర్షణీయం



మాట్లాడుతున్న ధర్మకర్త కిషన్‌రావు

చేగుంట(తూప్రాన్): దుబ్బాక ఎమ్మెల్యేగా కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలుపు హర్షణీయమని ఇబ్రహీంపూర్ ఆలయ ధర్మకర్త బీఆర్ఎస్ నాయకులు కిషన్‌రావు అన్నారు. మంగళవారం చేగుంటలో మండల సమన్వయకర్త వేణుగోపాల్‌శర్మతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కొత్త ప్రభాకర్‌రెడ్డిని నియోజకవర్గ ప్రజలు అఖండ మెజార్టీతో గెలిపించారని తెలిపారు. మండలంలోని ఇబ్రహీంపూర్‌లో అధిక మెజార్టీ అందించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

దివ్యాంగుడికి ఎస్సీ కార్పొరేషన్ చెక్కు అందజేత



చెక్కును అందిస్తున్న ఎంపీపీ నారాయణరెడ్డి

హవేళీఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని బూర్గుపల్లి గ్రామానికి చెందిన తొగరి సాయిలుకు ఎస్సీ కార్పొరేషన్ కింద మంజూరైన రూ.1లక్ష చెక్కును ఎంపీపీ శేరి నారాయణరెడ్డి, ఎంపీడీఓ శ్రీరామ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించిన ఆ డబ్బులతో ఉపాధి అవకాశాన్ని పెంపొందించుకోవాలని వారు సూచించారు. ప్రతీ వ్యక్తి వ్యాపారాల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని ఎంపీపీ శేరి నారాయణరెడ్డి సూచించారు.

దేవతలులేని ఆలయాలు

శిథిలావస్థలో ఉన్నా.. పట్టించుకోని వైనం

రామాయంపేట(మెదక్): మండలంలోని కోనాపూర్ బండపై దేవతలు లేని ఆలయాలున్నాయి. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం. గ్రామాన్ని ఆనుకొని ఉన్న పెద్ద పరుపుబండపై మూడు ఆలయాలను 80 ఏళ్ల క్రితమే నిర్మించారు. పరుపుబండపై భారీస్థాయిలో ఖడీరాళ్లతో చూడచక్కగా నిర్మించిన ఈ ఆలయాల్లో ఎందుకనో దేవతలను ప్రతిష్ఠించలేదు. ఇతర ఆలయాలకు భిన్నంగా ఉన్న ఈ ఆలయాలు గత వైభవానికి చిహ్నంగా నిలిచాయి. దేవతలు లేని ఈ ఆలయాల్లో ఎలాంటి పూజా కార్యక్రమాలు నిర్వహించడంలేదు. కాగా ఈ ఆలయాల్లో ప్రతిష్ఠించిన విగ్రహాలను గతంలో ఇతర ప్రాంతాలకు తరలించుకపోయారనే వాదన కూడా వినిపిస్తోంది. వీటికి సంబంధించిన రాళ్లు కొన్ని కిందపడిపోవడంతో ఒక ఆలయం పూర్తిగా శిథిలమైంది. వీటిని సంరక్షించాల్సిన అవసరం ఉంది.



పూర్తిగా శిథిలమైన ఆలయం

ఆలయాలను పునరుద్ధరించాలి

కోనాపూర్ బండపై జీర్ణస్థితిలో ఉన్న ఈ ఆలయాలను పునరుద్ధరించాలి. ఇక్కడ ప్రతిష్ఠించిన విగ్రహాలను ఇతర ప్రాంతాలకు తరలించారని గ్రామ పెద్దలు చెబుతున్నారు. ఈ ఆలయాల్లో దేవుళ్లను ప్రతిష్టిస్తే బాగుంటుంది. అలాగే ప్రతీ రోజూ పూజలు జరిగేలా చూడాలి.

– సంజీవరెడ్డి, గ్రామస్తుడు



దేవుడి ప్రతిమలేని ఆలయం

ప్రపంచ మృతికా దినోత్సవం

రామాయంపేట(మెదక్): ప్రపంచ మృతికా దినోత్సవం సందర్భంగా వ్యవసాయ కార్యాలయం వద్ద మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. నేల సంరక్షణ, భూసార పరీక్షలు, జీవన ఎరువుల వాడకం, సేంద్రియ కర్బన పదార్థాల పెంపు, మట్టి నమూనాల సేకరణ, తదితర అంశాలపై మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమి సారవంతంగా ఉంటేనే పంటల దిగుబడి వస్తుందన్నారు. పంట దిగుబడులు పెంచే క్రమంలో రైతులు మోతాదుకు మించి ఎరువులు వినియోగిస్తుండటంతో భూ కాలుష్యం పెరిగి, మనుషుల ఆరోగ్యాలను దెబ్బతీస్తుందన్నారు. దీంతో పాటు పంటలకు మేలు చేసే సూక్ష్మ జీవులు, వానపాముల సంతతి క్షీణిస్తుందని, పంటల దిగుబడి క్రమంగా తగ్గుతుందని చెప్పారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పంటల దిగుబడులు పెంచాలంటే తప్పనిసరిగా నేలను సారవంతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో నిజాంపేట మండల వ్యవసాయ అధికారి సతీశ్, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు సాయికృష్ణ, రాజు, తేజస్వి, శ్రవంతి, రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ

శిథిలావస్థలో పాఠశాల భవనం

నిజాంపేట(మెదక్): మండల కేంద్రం నిజాంపేటలోని మండల ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో తరగతి గదుల్లోకి నీరు వస్తుంది. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో తూపాన్‌తో కురుస్తున్న స్వల్ప వర్షానికే తరగతి గదుల్లోకి నేరు వచ్చింది. దీంతో తరగతి గదులు విద్యార్థులకు ఇబ్బందికి గురయ్యారు. తరగతి గదులు శిథిలావస్థకు చేరడంతో బిల్డింగ్ పెచ్చులూ ఊడుతున్నాయి. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు పాఠశాలలోని అదనపు గదుల పనులను చేపట్టాలని శిథిలావస్థలో ఉన్న తరగతి గదులను తొలగించి, నూతన గదులను ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.



నిజాంపేట మండల ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్థకు చేరిన తరగతి గది

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

మనోహరాబాద్(తూప్రాన్): తెలంగాణ ఏర్పడ్డకా తొలి కాంగ్రెస్ సీఎంగా రేవంత్‌రెడ్డిని ప్రకటించడంతో మండలంలోని కాంగ్రెస్ శ్రేణులు టపాసులు పేల్చి, స్వీట్లు పంచుకొని సంబరాలు చేశారు. మంగళవారం రాత్రి కాంగ్రెస్ అధిష్ఠానం రేవంత్‌రెడ్డిని సీఎంగా ప్రకటించడంతో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేశారు.



సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

అల్లాదుర్గం(మెదక్): ఆటో ఢీకొనడంతో చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్లాదుర్గం గ్రామానికి చెందిన ఇదునూరి అక్షర (2) సోమవారం అడుకుంటూ వెళ్తుండగా, వేగంగా వచ్చిన జోగిపేట హెచ్‌పీ గ్యాస్ చెందిన ఆటో ఢీకొంది.దీంతో ఆ చిన్నారి అక్షరకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో చిన్నారిని జోగిపేట ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి తీవ్రంగా ఉండటంతో హైదరాబాద్ నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం ఆస్పత్రిలో మృతి చెందింది. ఈ సంఘటనపై చిన్నారి పెద్ద నాన్న సదానందం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.



అక్షర (ఫైల్)

శబరిమలకి అద్దె బస్సులు

గజ్వేల్‌రూరల్: శబరిమలైకి అద్దె ప్రాతిపదికన బస్సులు నడుపుతున్నట్లు జీపీపీ(గజ్వేల్–ప్రజ్ఞాపూర్) ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ పేర్కొన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ అయ్యప్ప స్వామి భక్తుల కోసం శబరిమలకు అద్దె ప్రాతిపదికన ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ బస్సులను నడుపుతున్నామన్నారు. స్వామి దర్శనం కోసం ఆర్టీసీ బస్సుల్లో వెళ్తే గుడి దగ్గరకు వెళ్లే అవకాశముంటుందని, గైడ్ చేసేందుకు ఆర్టీసీ ప్రతినిధులు అందుబాటులో ఉంటారన్నారు. అంతే గాకుండా బస్సులో ఒక గురుస్వామితో పాటు ఇద్దరు కన్నె స్వాములు, ముగ్గురు వంట వారికి సీటు లేకుండా ఉచిత ప్రయాణం అనుమతించడం జరుగుతుందన్నారు. స్వాములు బస్సును బుక్ చేసుకున్నట్లయితే గురుస్వామికి రోజుకు రూ.300 చొప్పున ప్రయాణం చేసే రోజుల్లో కమీషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆర్టీసీ బస్సులలో ప్రయాణం సురక్షితమన్నారు. మరిన్ని వివరాలకు ప్రజ్ఞాపూర్ జీపీపీ ఆర్టీసీ డిపోలో సంప్రదించాలని సూచించారు.

బాల్యమిత్రుడి కుటుంబానికి చేయూత

మిరుదొడ్డి(దుబ్బాక): మిత్రుడి కుటుంబానికి బాల్య స్నేహితులు అండగా నిలిచారు. మండల పరిధిలోని కొండాపూర్ గ్రామానికి చెందిన రాళ్ళ బండి నర్సింహాచారి గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బాల్యమిత్రులు మిత్రుడి కుటుంబాన్ని మంగళవారం పరామర్శించి ఓదార్చారు. రూ.23,500 నగదు, 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. పరామర్శించిన వారిలో కండ్లకొయ్య యాదగిరి, వేముల శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, పాపగారి శ్రీనివాస్, తీపిరెడ్డి రాజు, ముక్కపల్లి రాజమల్లు, మర్కంటి ఉమాపతి, గరిపల్లి రామకృష్ణ తదితరులు ఉన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

సమష్టి కృషితో కాంగ్రెస్ విజయం

పాపన్నపేట(మెదక్): కార్యకర్తలు, నాయకుల సమిష్టి కృషితో మెదక్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధ్యమైందని జిల్లా కాంగ్రెస్ రైతు సంఘం అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ఎన్ని ప్రలోభాలు ఎర చూపినా.. ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి ఓటేసి 10 వేల మెజార్టీతో రోహిత్‌ను గెలిపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, కాంగ్రెస్ మండల అధ్యక్షులు గోవింద్ నాయక్, సంతోష్ రెడ్డి, ఎంపీటీసీలు శ్రీనివాస్, రాము, నిఠలాక్షప్ప, కిషన్‌రెడ్డి, గులాం దస్తగీర్ ఉన్నారు.

నేడు మండలంలో సర్వసభ్య సమావేశం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రం చిలప్‌చెడ్ ఎంపీడీఓ కార్యాలయంలో నేటి బుధవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ వినోదరెడ్డి, ఎంపీడీఓ శశిప్రభ తెలిపారు. మంగళవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశం నేటి ఉదయం 11 గంటలకు ప్రారంభవుతుందన్నారు. ఈ సమావేశానికి మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు పూర్తి సమాచారంతో కచ్చితంగా హాజరుకావాలన్నారు.

కేవీఆర్‌ను కలిసిన బీజేపీ నాయకులు



కేవీఆర్‌తో అశోక్

కౌడిపల్లి(నర్సాపూర్): శాసనసభ ఎన్నికల్లో సీఎం కేసీఆర్, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై కామరెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందిన బీజేపీ నాయకుడు కే. వెంకట రమణారెడ్డిని కౌడిపల్లి మండలం వెల్మకన్న గ్రామానికి చెందిన జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి అశోక్ ఇతర నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఏఐసీసీ ప్రకటన హర్షణీయం

జగదేవ్‌పూర్(గజ్వేల్): తెలంగాణ సీఎం అభ్యర్థిగా రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించడంపై యువజన కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు, తిగుల్ గ్రామ సర్పంచ్ కప్పర భానుప్రకాష్‌రావు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఏఐసీసీ నిర్ణయం అభినందనీయమన్నారు. ఆరు గ్యారంటీ పథకాలు లబ్ధిదారులకు అందించేలా తమవంతు కృషి చేస్తానన్నారు. తిగుల్‌లో టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించారు. అలాగే అందోల్ ఎమ్మెల్యే దామోదర్ రాజనర్సింహ జన్మదినం సందర్భంగా ఆయనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడి రాజీనామా

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని కల్లెపెల్లి గ్రామానికి చెందిన చెలుకల కొండల్‌రెడ్డి బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్ష పదవి, రైతు బంధు గ్రామ కమిటీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు మంగళవారం తెలిపారు. పార్టీలో సరైన గుర్తింపులేక పోవడంతో రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు.

చాకరిమెట్లలో ఎమ్మెల్యే పూజలు



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చాకరిమెట్లలో కొలువైన సహకార ఆంజనేయస్వామిని మంగళవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి దర్శించుకున్నారు. ఎమ్మెల్యేగా విజయం సాధించి మొదటిసారిగా ఆలయానికి వచ్చిన ఆమెకు ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ఈఓ శ్రీనివాస్‌లు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేసి సన్మానించారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానని ఆమె అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

సునీతారెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

వెల్దుర్తి(తూప్రాన్): నర్సాపూర్ టీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి గెలుపొందడంపై ఆ పార్టీ నాయకుల్లో సంతోషం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఉమ్మడి వెల్దుర్తి మండలంలోని ముఖ్య నాయకులు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు వేర్వేరుగా ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆమెను కలిసి మిఠాయిలు తినిపించారు.



సునీతారెడ్డిని సన్మానించిన సర్పంచ్ నర్సింలు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు చాకరిమెట్లలో సునీతారెడ్డిని కలిసి అభినందనలు తెలిపినట్లు ఆ పార్టీ నాయకుడు ముత్యంగారి ప్రవీణ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆమెను కలిసిన వారిలో పీఏసీఎస్ చైర్మన్ మనోహర్, నాయకులు రాజా గౌడ్, కృష్ణ గౌడ్, పాండరి వెంకటేశం, ప్రభాకర్ నాయకులు ఉన్నారు.

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని కలిసిన నేతలు



కొత్త ప్రభాకర్‌రెడ్డిని కలిసిన ఎంపీపీ సబిత

చిన్నశంకరంపేట(మెదక్): దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని నార్సింగి ఎంపీపీ సబిత మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం హైదారాబాద్‌లోని ఆయన నివాసంలో నార్సింగి ఎంపీటీసీ కుమ్మరి సత్య నారాయణ, పట్టణ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, యువ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎంకే శ్రీకాంత్, వెంకట్రాజు, హరీశ్, నాగవర్ధన్, స్వామి, వేణు, శ్రీధర్, శ్రీకాంత్, సందీప్ ఉన్నారు.

పరామర్శ

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని చిన్నకిష్టాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యూత్ జిల్లా నాయకుడు బీరప్ప తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ బీరప్పను పరామర్శించారు.

డబ్బుల కోసం రైతుల పడిగాపులు



వెల్దుర్తి బ్యాంక్ ఎదుట చెప్పుల క్యూలైన్

వెల్దుర్తి(తూప్రాన్): ఆరుగాలం కష్టించి పండించిన పంట విక్రయించగా వచ్చిన డబ్బులు రైతుల అకౌంట్‌లో జమ అయినా వాటిని విత్‌డ్రా చేసుకోవడానికి రైతులు కష్టాలు పడుతున్నారు. ఇందుకు వెల్దుర్తి సెంట్రల్ బ్యాంక్ ఎదుట చోటు చేసుకున్న ఘటనే చక్కటి నిదర్శనం. అకౌంట్‌లో నుంచి డబ్బులు డ్రా చేసుకోవడం కోసం మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఖాతాదారులు (రైతులు) ఉదయం 8 గంటల నుంచే బ్యాంక్ వద్దకు చేరుకున్నారు. దీంతో క్యూలైన్‌లో ఉండలేక చెప్పులు, బ్యాంక్ పాస్ పుస్తకాలను ఉంచి అధికారుల రాక కోసం ఎదురు చూశారు. ధాన్యం అమ్మగా వచ్చిన డబ్బులను డ్రా చేసుకోవడానికి వెళితే మొత్తం డబ్బులు ఒక్కసారిగా ఇవ్వడం లేదని, ఒక్కోసారి సర్వర్ ప్రాబ్లం అంటూ బ్యాంక్ సిబ్బంది వెళ్లగొడుతున్నారంటూ పలువురు రైతులు ఆరోపించారు.

వివాహిత అదృశ్యం

వెల్దుర్తి(తూప్రాన్): డబ్బులు తీసుకొస్తానని ఇంటి నుంచి వెళ్లిన వివాహిత అదృశ్యమైన ఘటన మండలంలోని ఉప్పులింగాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ వసురాం తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన శ్రీశైలం అనే యువకుడికి మండలంలోని శెట్టిపల్లికలాన్ గ్రామానికి చెందిన కవిత అనే యువతితో సుమారు 18 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు, కూతురు. డబ్బులు తీసుకొస్తానని భర్తతో చెప్పి సోమవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో కవిత ఇంటి నుంచి బయటకు వెళ్లింది. మంగళవారం రాత్రి వరకు ఆచూకి కోసం గాలించినా.. ఫలితం లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శెట్టిపల్లి కలాన్ గ్రామానికి చెందిన వ్యక్తితో పారిపోయి ఉంటుందని భర్త శ్రీశైలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.



కవిత(ఫైల్)

ధాన్యపు రాశులకు కవర్లు రక్షణ

జగదేవ్‌పూర్(గజ్వేల్): తుఫాన్ ప్రభావం కారణంగా ఆకాశం మేఘావృతం కావడంతో రైతులు అప్రమత్తమయ్యారు. ధాన్యాన్ని రక్షించుకునేందుకు నానా అవస్థలుపడుతున్నారు. మండలంలో 20 రోజుల క్రితం వరి కోతలు ప్రారంభించారు. 29 గ్రామాల్లో 12 వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. దీంతో 14 గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని సంబంధిత అధికారులు తెలిపారు. ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రోడ్డుపై కుప్పలు పోశారు. అయితే మూడు రోజులుగా తుఫాన్ ప్రభావంతో చిరు జల్లులు కురుస్తుండటంతో ధాన్యం తడుస్తోంది. ధాన్యాన్ని దక్కించుకునేందుకు ధాన్యపు రాశులపై కవర్లు కప్పుతున్నారు. అధికారులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ నిబంధనల పేరిట ఇబ్బందిపెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వర్షాలు కురిస్తే ధాన్యం తడిచి నష్టం వాటిల్లుతుందని, వెంటనే కొనుగోలు చేయాలని కోరుతున్నారు.



రోడ్డుపై ఆరబోసిన ధాన్యంపై కవర్లు కప్పిన దృశ్యం